క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలపై కొరడా

మర్రిపాలెం: నిబంధనలు అతిక్రమించి రోడ్డు పక్కనే పార్క్‌చేసిన భారీ వాహనాలపై కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. ఈ మేరకు శుక్రవారం జ్ఞానాపురం నుంచి కంచరపాలెం వరకు రాంగ్ పార్కింగ్ చేసిన లారీలపై డ్రైవ్ నిర్వహించామని సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఆ ప్రాంతాల్లో స్కూళ్లు ఎక్కువగా ఉన్నాయని, ట్రాఫిక్ సమస్య, ప్రజలకు అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన చెప్పారు. 50 లారీలు వరుసగా రాంగ్ పార్కింగ్ చేసి వున్నాయని, వాటిలో 49 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు.

'విశ్వకర్మ యోజన పథకం ఓ వరం'



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాచారి

డాబాగార్డెన్స్: కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విశ్వకర్మ యోజన పథకం ఓ వరం వంటిదని విశాఖపట్నం విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాగులకొండ సూర్యాచారి తెలిపారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విశ్వబ్రాహ్మణ జాతి తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి నాగులకొండ అశ్లేషాచారి, ఆవుపాటి శంకర్, కండిపల్లి శ్రీను, బీసీ సెల్ నాయకుడు తమరి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునికంగా రాజేంద్రప్రసాద్ వార్డు



కేజీహెచ్‌లో ఆధునికీకరించిన ఓపీ కౌంటర్లు



భావనగర్ వార్డు ముందు నూతనంగా నిర్మించిన రూఫింగ్

- 20 బెడ్స్‌తో కొత్త ఏఎంసీయూ నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న మంత్రి రజని

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : ఉత్తరాంధ్ర పెద్ద ఆస్పత్రిగా పేరొందిన కేజీహెచ్‌లో అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగుల కష్టాలు తీరనున్నాయి. ముఖ్యంగా ఈ ఆస్పత్రికి వచ్చే పేద రోగుల్లో ఎక్కువ మంది రాజేంద్రప్రసాద్ వార్డుకు వస్తుంటారు. ఇక్కడి ఏక్యూరేట్ మెడికల్ కేర్ యూనిట్ (ఏఎంసీయూ) - 1లో రోగుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో గతంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఇక్కడి పరిస్థితిని చూసి చలించిపోయారు. ఒకే మంచంపై ఇద్దరేసి రోగులు ఉండడం చూసి తీవ్రంగా స్పందించారు. దీంతో కేజీహెచ్ అప్పటి జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వై.జి.సుందరరాజు మాట్లాడుతూ ఏఎంసీయూ - 2 నిర్మాణం ద్వారా రోగులందరికీ సేవలందించడానికి వీలు కలుగుతుందని చెప్పారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఆస్పత్రిలోని రాజేంద్రప్రసాద్ వార్డులో రూ.32 లక్షలతో ఏక్యూరేట్ మెడికల్ కేర్ యూనిట్ - 2 (ఏఎంసీయూ) నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ క్రమంలో ప్రస్తుతం 20 పడకలతో సిద్ధమైన ఆ వార్డుతోపాటు మొత్తంగా రూ.1.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి విడదల రజిని శనివారం ప్రారంభించనున్నారు.

ఓపీ భవనాల ఆధునికీకరణ

కేజీహెచ్‌లో ఓపీ భవనాలను ఆధునికీకరించారు. ప్రస్తుతం ఏడు కౌంటర్లు ఉన్నప్పటికీ రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో గంటల తరబడి ఓపీ చీటీల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు మరో ఆరు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పురుషులు, మహిళల కోసం వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటికి ఏసీ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. మరోవైపు ఓపీ గేటు ఎదురుగా ఉన్న ఫౌంటెన్‌ను ఆధునికీకరించారు.

ల్యాండ్ స్కేపింగ్ చేసి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించారు. అదేవిధంగా భావనగర్ వార్డు ముందు రూఫింగ్ నిర్మించారు. ఈ వార్డుకు రోగులను తీసుకొచ్చే సహాయకులు ఎండ, వాన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రూఫింగ్ నిర్మించారు. దీని వల్ల రోగుల సహాయకులకు ఎంతో ఉపశమనం కలుగుతుంది.

విధులు సక్రమంగా నిర్వహించండి



పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని జీవీఎంసీ జోన్ - 4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన జోన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర సుందరీకరణకు పారిశుధ్య కార్మికులే కీలకమన్నారు. ఉదయాన్నే వచ్చి కార్మికులు రహదారులు, గెడ్డలు, కల్వర్టులు, చెత్త సేకరణ వంటి పనులు చేస్తున్నారన్నారు. విధుల్లో ఉన్నప్పుడు పారిశుధ్య కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జోన్ పరిధి 31వ వార్డు జగదాంబ వార్డు కార్యాలయంలో సిబ్బంది రికార్డులు, కార్మికుల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరెడ్డి, సెక్రటరీలు పాల్గొన్నారు.

కార్పెంటర్ అనుమానాస్పద మృతి

అల్లిపురం : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. సీఐ రేవతి తెలిపిన వివరాల ప్రకారం... రెల్లివీధికి చెందిన సురకల సత్తిరాజు (46) కార్పెంటర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. లక్ష్మీటాకీస్ ఎదురుగా గల ఎస్‌కే బిల్డింగ్‌లో పనినిమిత్తం శుక్రవారం వెళ్లాడు. అతనితోపాటు వచ్చిన వ్యక్తి సాయంత్రం వెళ్లిపోతూ సత్తిరాజును రమ్మని పిలిచాడు. తనకు పని ఉందని, పూర్తి చేసుకుని వస్తానని సత్తిరాజు చెప్పడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొంత సేపటికి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భవనం లోపలికి వెళ్లి చూసేసరికి సత్తిరాజు రక్తపు మడుగులో పడివున్నాడు. అతని మెడ, భుజం వద్ద తీవ్ర గాయాలు ఉండడంతో వారు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో సీఐ రేవతి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణంపై ఆరా తీస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రమాదవశాత్తు కార్పెంటరీ మెషీన్ పైన పడి గాయాలపాలై చనిపోయాడా..? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా..? అని విచారణ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

లాడ్జీలో గుంటూరు వాసి మృతి

అల్లిపురం : మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జీలో వ్యక్తి శుక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. సీఐ బి.రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా గాంధీనగర్‌కు చెందిన కొల్లిపర కృష్ణమోహన్(24) గురువారం జగదాంబ జంక్షన్ సమీప లాడ్జీలో దిగాడు. శుక్రవారం ఉదయం నుంచి అతను బయటకు రాకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి తలుపులు కొట్టారు. అయినా తెరవకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో వచ్చి గది తలుపులు తెరిచి చూసేసరికి కృష్ణమోహన్ అచేతన స్థితిలో పడి ఉన్నాడు. ఆధార్ కార్డు, ఫోన్ నంబరు ఆధారంగా కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

క్యాన్సర్‌కు మనోధైర్యమే చికిత్స

- తొలి దశలో గుర్తిస్తే నివారణ సులువు
- నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం



మహారాణిపేట: వైద్య విజ్ఞానం ఎంతగానో అభివృద్ధి చెందినా ఇప్పటికీ తెలిసిన వారికి, బంధువులకు క్యాన్సర్ అని తెలిస్తే... ఒళ్లు జలదరిస్తుంది. ఎన్నో సందేహాలు, భయాలు, అనుమానాలు వెంటాడుతుంటాయి. తొలిదశలోనే గుర్తించి, మనోధైర్యంతోడైతే క్యాన్సర్‌ను జయించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఏటా ఫిబ్రవరి 4న పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్, రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం క్యాన్సర్‌కు ఉచిత చికిత్స కూడా అందిస్తున్నాయి. విశాఖ జిల్లాలో కేజీహెచ్‌తో పాటు పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్యాన్సర్‌కు చికిత్స అందుబాటులో ఉంది. దీంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా బాధితులు చికిత్స కోసం విశాఖ వస్తున్నారు. గతంలో ఏడాదికి 1500 నుంచి 2 వేల వరకు కేసులు వచ్చేవి. ఇప్పుడు ఏడాదికి 12 వేల నుంచి 15 వేల వరకు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

కేజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ

ప్రస్తుతం కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు వారానికి మూడు రోజుల పాటు ఓపీ నిర్వహిస్తున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శిల్పా ఈ ఓపీ నిర్వహిస్తున్నారు. ఆయా రోజుల్లో 125 నుంచి 150 వరకు బాధితులు వస్తున్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేజీహెచ్‌లో సీఎస్ఆర్ బ్లాక్ మొదటి అంతస్తులో వార్డును ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



క్యాన్సర్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డును కూడా ఏర్పాటు చేస్తున్నారు. రోగులకు వైద్య సేవలు అందించేలా అధునాతన పరికరాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. క్యాన్సర్‌కు భయపడవలసిన పరిస్థితి లేదు. నివారణ సాధ్యమే. మనోధైర్యంతో ముందుకు వెళ్తే సంపూర్ణ ఆరోగ్యంతో బయటపడవచ్చు.

– డాక్టర్ శిల్ప, క్యాన్సర్ వైద్యురాలు, కేజీహెచ్

జీవన శైలిలో మార్పులు అవసరం



వివిధ కారణాల వల్ల క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. జీవన శైలిలో మార్పులు రావడం, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వల్ల కూడా క్యాన్సర్ సోకుతుంది. ఇప్పుడు క్యాన్సర్ వ్యాధిపై భయపడవలసిన అవసరం లేదు. ఎంతో మందికి చికిత్స అందిస్తున్నాం. వారికి తగ్గుముఖం పడుతోంది. పూర్వ స్థితికి వస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి.

– డాక్టర్ మురళీకృష్ణ, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, ఎంవీపీ కాలనీ

తొలి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమే



తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారణ చేయడానికి వీలు ఉంటుంది. ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల ఎక్కువ మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రతి మనిషి తన జీవన శైలిలో వ్యాయామం తప్పకుండా చేయాలి. ఎంతో మంది క్యాన్సర్‌ను జయించి సాధారణ జీవితం గడుపుతున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి.

– డాక్టర్ బెల్లాల రవిశంకర్, ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ, విశాఖపట్నం

అందుబాటులో ఆధునిక చికిత్స



క్యాన్సర్ వ్యాధి బారిన పడితే చనిపోతామన్న భయం ప్రజల్లో ఎక్కువగా ఉంది. కానీ ఇప్పుడు ఆధునిక చికిత్స విధానం అందుబాటులోకి వచ్చింది. ప్రాథమిక దశలో గుర్తించి తగిన వైద్యం తీసుకుంటే కోలుకోవచ్చు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ బారిన ఎక్కువ మంది మహిళలు పడుతున్నారు. వీటిని కూడా తొలి దశలో గుర్తించే ఆధునిక పరికరాలు వచ్చాయి.

– డాక్టర్ రఘునందరావు, వ్యవస్థాపక డైరెక్టర్, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, అగనంపూడి

ఎమ్మెల్యే వాసుపల్లి చేయూత

- ముగ్గురికి రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



36వ వార్డులో ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: ఆపదలో ఉన్న వారికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్‌లో భాగంగా 34వ వార్డు అచ్చియ్యమ్మపేట జంక్షన్ వైఎస్సార్ విగ్రహం వద్ద, 36వ వార్డు జామియా మసీదు వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో భాగంగా కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న 29వ వార్డు పరిధి రామజోగిపేటకు చెందిన కారంపాడి ప్రశాంత్‌కుమార్‌కు రూ.5 వేలు అందజేశారు. 30వ వార్డు పరిధి కొత్తశాలిపేటకు చెందిన పెందుర్తి ఆనంద్ కుమారుడు చనిపోవడంతో అతని కోడలు ఆరోగ్య పరిస్థితి బాలేదని తెలియడంతో ఎమ్మెల్యే రూ.5వేలు అందజేశారు. 34వ వార్డు పరిధి కొబ్బరితోటకు చెందిన వాసుపల్లి రిషిత్ తల్లి గత నెలలో చనిపోవడంతో రూ.5వేలు అందించారు. అదేవిధంగా ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, 36వ వార్డు ప్రెసిడెంట్ మాసిపోగు రాజు, 29వ వార్డు ప్రెసిడెంట్ పీతల వాసు, స్టేట్ యూత్ సెక్రటరీ మాన్యాల శ్రీనివాస్, బర్రి చిన్నప్పన్న, బెవర మహేష్, కోరాడ సురేష్, దశమంతుల చిన్ని, లండా రమణ, లింగం శ్రీనివాసరావు, బొడ్డేటి ప్రసాద్, దూడ అప్పారావు, తాతబ్బాయి, వెంకటేష్, వాసుపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్

- వర్సిటీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు కల్పించాలి
- ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి




మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్ రూపొందించారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'యూనియన్ బడ్జెట్-2023' చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వడం, కొంత వెసులుబాటు కల్పించడం ఎంతో అవసరమన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించడం శుభ పరిణామమన్నారు. ఇది ప్రగతిశీల ఆలోచనగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ అంతా సాంకేతిక విప్లవం, సవాళ్లకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనికి అనుగుణంగా యువతరం తమను తాము మెరుగుపరచుకోవాలని సూచించారు. ఏయూలో స్కూల్స్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని స్కూల్‌గా మార్పు చేస్తామన్నారు. నూతనంగా ఇంక్యుబేషన్ సెంటర్ నెలకొల్పి, స్టార్టప్ కల్చర్‌ను ప్రోత్సహిస్తామన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిశోర్‌బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సింహపురి వర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య ఆర్.సుదర్శనరావు, చార్టెడ్ అకౌంటెంట్ ఆకుల చంద్రశేఖర్, పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య డి.ప్రభాకరరావు, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి కేంద్ర బడ్జెట్‌పై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు



గిరిజన విద్యార్థులతో నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు

మహారాణిపేట: భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై యువత అవగాహన పెంచుకోవాలని నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు ఎ.ఆర్.విజయరావు సూచించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, యువజన క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నెహ్రూ యువ కేంద్రం, విశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ సభ్యత సంస్కారానికి, సంస్కృతి,సంప్రదాయలకు భారతదేశం నిలయమన్నారు. అందుకే మనదేశం మిగతా దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. యువత సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బస్తర్, కంకేర్, నారాయణపూర్, రాజ్‌నంద్‌గావ్ జిల్లాలు, జార్ఖండ్‌లోని గుమ్లా, కుంటి, లోహార్‌దగా, లతేహర్ జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలోని ఖండమాల్ జిల్లాల నుంచి 220 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు. విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, కైలాసగిరి, సబ్‌మెరైన్ మ్యూజియం, ఆర్.కె.బీచ్ తదితర ప్రాంతాలను వారు సందర్శించారు. ముగింపు కార్యక్రమంలో విశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామ్‌నరేష్, సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరరావు, విజయనగరం జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య, ఇతర అధికారులు ఎం.సి.బాబురెడ్డి, శ్రీనివాస్, రాంప్రసాద్, వి.పి.దేవి పాల్గొన్నారు.

6 నుంచి విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 91 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 5.45 గంటల నుంచి పలు చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 6న జమున నటించిన..ఉండమ్మా బొట్టు పెడతా, 7న మాలపిల్ల, 8న విరాటపర్వం సినిమాలు ప్రదర్శించనున్నట్టు చెప్పారు. ప్రవేశం ఉచితమని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు , వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు ఎన్‌పీడీ పాల్, సభ్యులు సంతోష్‌కుమార్, డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాపు..

ఫెస్టివల్‌లో భాగంగా ఫిల్మ్‌మేకింగ్‌పై 7న ఉదయం 10 గంటలకు పౌరగ్రంథాలయంలో ప్రముఖ సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య (మనసంతా నువ్వే ఫేం) వర్క్‌షాప్ నిర్వహించనున్నారని నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ వర్క్‌షాపునకు 18ఏళ్లు దాటిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 9441571581, 9032477463 నంబర్లలో సంప్రదించవచ్చు.

కేశాల విరాళం అభినందనీయం

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

ఆరిలోవ: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు కేశాలు విరాళం ఇవ్వడం అభినందనీయమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం హెల్త్‌సిటీలోని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రిలో కేశాల విరాళ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు నగరానికి చెందిన కొందరు మహిళలు వారి కేశాలు విరాళంగా అందించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉండటం విశేషం. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్‌ను నయం చేయడానికి ఆధునిక పద్ధతుల్లో అన్ని రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ధైర్యంతో ఉండాలని.. అలాంటప్పుడే వ్యాధిని అధిగమించగలరన్నారు. హెచ్‌సీజీ అంకాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కె.ఎన్.మల్లేశ్వరి

కూర్మన్నపాలెం : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, దేశం గర్వపడేలా తీర్చిదిద్దడమే ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ముఖ్య లక్ష్యమని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి కె.ఎన్.మల్లేశ్వరి అన్నారు. శని,ఆదివారాల్లో ప్రజాస్వామిక రచయిత్రల వేదిక 7వ వార్షికోత్సవం పురస్కరించుకుని జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలోని ఓ హోటల్‌లో శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 4,5 తేదీల్లో ఉక్కు నగరం సమీపంలోని దేశపాత్రునిపాలెం సంస్కృతి గ్లోబల్ హైస్కూల్‌లో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ఘనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పాటు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ వేదికలో రెండు తెలుగు రాష్ట్రాల రయితలు, కవులు, సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. కవులు, రచయితలు మమత, సత్య, గోపి మాట్లాడుతూ వ్యాసం, కథ, కవిత్వం, పాట, ప్రక్రియలపై విద్యార్థుల మనోభావాలను పంచుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ సమన్వయకర్త మానస ఎండ్లూరి, ఏపీటీఎస్ రాష్ట్ర నాయకులు వెంకటపతిరాజు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, కథా రచయిత దగ్గుబాటి పద్మాకర్, చిన్నపిల్లల కథా రచయిత అనిల్ తదితరులు పాల్గొన్నారు.